క్లుప్తంగా

అసిస్టెంట్ ప్రొఫెసర్ సరితకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బోటనీ విభాగం పరిశోధకురాలు, హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ కొమ్మిడి సరితకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. స్లాండ రైజేషన్ ఇన్ విట్రో టెక్నిక్స్ అండ్ జెనిటిఫ్ ఫైడెలిటీ ఆఫ్ కెర్రోస్టిస్ పోయెట్ డిస్సిమా (జాకో) కాగ్న – యాన్ ఇంపార్టెంట్ మెడిసినల్ క్లయింబర్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి కొమ్మిడి సరితకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. బోటనీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎండి.ముస్తఫా పర్యవేక్షణలో సరిత తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

రంజిత్‌కుమార్‌కు దళితరత్న అవార్డు



కాజీపేట: దళితరత్న అవార్డును కాజీపేట పట్టణానికి చెందిన 63వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బెదరకోట రంజిత్‌కుమార్ అందుకున్నారు. దళితుల అభివృద్ధికి రంజిత్ కుమార్ చేస్తున్న సేవలను గుర్తించి అంబేడ్కర్ జయంతి సందర్భంగా రాష్ట్ర మోచి కులసంఘం నాయకులు రవీంద్రభారతిలో ఆయనకు అవార్డు ప్రదానం చేశారు.

రిటైర్డ్ ప్రొఫెసర్ల డైరెక్టరీ విడుదల



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ల సంఘం రూపొందించిన నూతన సంవత్సరం డైరెక్టరీని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ డైరెక్టరీలో పలు వివరాలు ఉన్నాయని, ఈ సమాచారం విశ్రాంత అధ్యాపకులకు ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, కేయూ విశ్రాంత అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సదానందం, జనరల్ సెక్రటరీ రవీందర్, కోశాధికారి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కేయూ లైబ్రరీకి రైటింగ్ ప్యాడ్‌ల అందజేత



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పరిశోధకులు, విద్యార్థుల ఉపయోగార్థం కేయూ లైబ్రరీకి రూ.20 వేల విలువైన 100 రైటింగ్ ప్యాడ్‌లను హనుమకొండలోని శ్రీలక్ష్మి బుక్‌స్టాల్ యజమాని కొలగాని అభినవ్ శనివారం అందజేశారు. తన తండ్రి కొలగాని శ్రీనివాస్ జ్ఞాపకార్థం రైటింగ్ ప్యాడ్‌లను అందజేసినట్లు అభినవ్ తెలిపారు. ఈ సందర్భంగా అభినవ్‌ను లైబ్రరీ సిబ్బంది సన్మానించారు.

డీఎంహెచ్‌ఓకు సన్మానం



ఎంజీఎం: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సాంబశివరావు జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్టు అసోసియేషన్ నాయకులు శనివారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీపీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని సుదర్శన్‌గౌడ్, ఐక్యవేదిక సెంట్రల్ కోర్ కమిటీ సభ్యులు బానోతు నెహ్రూచంద్ నాయక్, వేణుగోపాల్, శరత్‌బాబు, వేణు తదితరులు ఉన్నారు.

కాన్‌స్టిట్యూషనల్ మార్చ్‌ను విజయవంతం చేయండి

నయీంనగర్: పాత పెన్షన్ సాధనకు ఏప్రిల్ 16న వరంగల్ ఎంజీఎం కూడలి నుంచి ఏకశిల పార్కు వరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలంగాణ స్టేట్ సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ తెలిపారు. అనంతరం, హనుమకొండ కలెక్టరేట్ వరకు చేపట్టనున్న పాదయాత్ర విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లతో పాటు అన్ని సంఘాల బాధ్యులు ర్యాలీలో పాల్గొని ఉద్యోగుల పాత పింఛన్ ఆకాంక్షను ప్రభుత్వానికి తెలియజేయాలని ఒక ప్రకటనలో కోరారు.

చదువుకు చేయూత

- జిల్లాలో మిషన్ వాత్సల్య పథకం అమలు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ
- 30 వరకు అవకాశం

కాశీబుగ్గ సెంటర్: పేదరికంతో విద్య, వైద్యానికి ఎవరూ దూరం కావొద్దనే లక్ష్యంతో 18 ఏళ్ల వయస్సు లోపు ఆదరణ లేని చిన్నారులకు చేయూతనిచ్చేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని అములు చేస్తున్నాయి. అందులో భాగంగా వరంగల్ జిల్లాలో అమలుకు జిల్లా సంక్షేమ శాఖ శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద గుర్తింపు పొందిన చిన్నారులకు ప్రతీనెల రూ.4 వేలు అందిస్తారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 2,400, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,600 అందజేస్తుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారైతే రూ.96 వేలు, పట్టణ ప్రాంతాల వారైతే రూ.96 వే లు మించి ఆదాయం ఉండరాదు. ప్రభుత్వ వసతి గృహాల్లో, బాల సదనాల్లో చేరినా, పాఠశాలలకు సక్రమంగా వెళ్లకపోయినా ఈపథకాన్ని నిలిపేస్తా రు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా సీడీపీఓ కార్యాలయానికి చేరుకున్న దరఖాస్తులను చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు పరిశీలించి జిల్లా కమిటీ బడ్జెట్ ఆమోదం కోసం ప్రతిపాదనల నివేదిక పంపుతారు.

దరఖాస్తు చేసుకోవాలి

మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాచర్ల శారద తెలిపారు. శనివారం హనుమకొండలోని వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సీడీపీఓలు, డీసీపీయూ సిబ్బంది, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఇందులో డీడబ్ల్యూఓ శారద మాట్లాడుతూ.. అర్హులు సంబంధిత అంగన్వాడీ కేంద్రాల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈపథకం ద్వారా లబ్ధిపొందడానికి ఒక కుటుంబం నుంచి ఇద్దరు పిల్లల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

అర్హులు ఎవరంటే..

తల్లిదండ్రులు లేని, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన చిన్నారులు, విడాకులు పొందిన వారి పిల్లలు, ప్రాణాంతక వ్యాధి ఉన్న వారి పిల్లలు, దివ్యాంగులైన వారి పిల్లలు, ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాల యాచకులు, హెచ్ఐవీ బారిన పడిన పిల్లలు, కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను మాత్రమే అర్హులుగా గుర్తిస్తారు.



మిషన్ వాత్సల్య పథకం అమలుపై సూచనలిస్తున్న డీడబ్ల్యూఓ శారద

జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు : 919	
ప్రాజెక్టులు : 3	
కేంద్రాల్లో చిన్నారులు : సుమారు 44 వేల మంది	

కావాల్సిన ధ్రువ పత్రాలు

జనన ధ్రువ పత్రం, పిల్లల ఆధార్ కార్డు, తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్, పిల్లల వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్ లేదా సంరక్షకుడితో కలిసి ఉన్న జాయింట్ అకౌంట్ వివరాల పూర్తి సమాచారం ఇవ్వాలి.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

- 80 ఫీట్ల నుంచి 60ఫీట్ల వరకు కుదింపు

హసన్‌పర్తి: భీమారం సెంటర్ నుంచి బొ్ౖడాయి వరకు రోడ్డు విస్తరణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఏడాది క్రితం నిధులు విడులయ్యాయి. భీమారం సెంటర్ నుంచి చింతగట్టు రింగ్ రోడ్డు వరకు టెండర్ కూడా పూర్తయింది. అయితే, బొ్ౖడాయి నుంచి చింతగట్టు రింగ్‌రోడ్డు వరకు ఆరు నెలల క్రితమే పనులు పూరయ్యాయి.

అభ్యంతరాలతో నిలిచిన పనులు

రోడ్డు వెడల్పు విషయంలో స్థానికుల అభ్యంతరం మేరకు భీమారం సెంటర్‌నుంచి బొ్ౖడాయి వరకు పనులు నిలిచిపోయాయి. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) కొత్త యాక్షన్ ప్లాన్ మేరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిదులు నిర్ణయించారు. ఈ మేరకు మార్కింగ్ కూడా చేశారు. అయితే బాధితుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కొత్త ప్రణాళిక వల్ల ఇళ్లు కోల్పోతున్నామని ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ఎదుట బాధితులు వాపోయారు.



విస్తరణ పనులు చేపట్టిన అధికారులు

పాత యాక్షన్ ప్లాన్ మేరకు..

కుడా పాత యాక్షన్ ప్లాన్ మేరకు 60ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత తెలిపారు. రోడ్డుతో పాటు ఇరువైపులా మురుగునీటి కాల్వల నిర్మాణం చేపడతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, దేవస్థాన కమిటీ చైర్మన్ చింతల లక్ష్మణ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, బీఆర్‌ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నాయకపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుమ్మ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి



సమ్మె నోటీసులు అందజేస్తున్న కార్యదర్శులు

హన్మకొండ అర్బన్: నాలుగేళ్ల ప్రొబెషనరీ పీరియడ్ పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శులు డిమండ్ చేశారు. ఈమేరకు తెలంగాణ పంచాయతీ సెక్రటరీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకారపు సురేష్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్‌ను హనుమకొండ జిల్లా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించకుంటే ఈనెల 28వ తేదీన నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ సంతోష్, గిరిబాబు, వెంకటేశ్వర్లు, కిరణ్, వినయ్‌కిరణ్, సందీప్, శ్రీనివాస్, రవికుమార్, బుచ్చిరెడ్డి, నర్సింగం, రాజు, ప్రభ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

రైతు భవనం ఆక్రమించుకున్న చందర్‌రావు

- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు రైతు సంఘాల నాయకుల ఫిర్యాదు

వరంగల్: తెలంగాణ రైతు సంఘం భవనాన్ని ఆక్రమించుకొని ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్న మోర్తాల చందర్‌రావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ అబ్బనికుంట ప్రాంతంలో తెలంగాణ రైతు సంఘం పేరుతో ఉమ్మడిగా భవన నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆ భవనంతో పాటు వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని చందర్‌రావు అక్రమంగా స్వాధీనం చేసుకొని తన అల్లుడైన పెండ్లి లింగమూర్తి పేరుపై తప్పుడు పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేయించగా, రద్దు చేయాలని రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో రిజిస్ట్రేషన్ రద్దు అయినట్లు తెలిపారు. దీంతో రైతు భవనంలో చందర్‌రావు తన అల్లుడి కుటుంబాన్ని ఉంచి రైతు సంఘాల నాయకులను లోపలికి రానీయకుండా ఘర్షణకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో చందర్‌రావుపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు కూడా నమోదు అయినట్లు వివరించారు. చట్ట వ్యతిరేక పద్ధతిలో సంఘం భవనాన్ని తన కుటుంబ సభ్యుల పేరున రిజిస్ట్రేషన్ చేయించుకొనుటకు ప్రయత్నిస్తున్న చందర్‌రావుపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఉపాధ్యక్షుడు హంసల్‌రెడ్డి, కోశాధికారి సిరుల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు జెండా అంబయ్య, జంగా జనార్దన్‌రెడ్డి, డి.దామోదర్‌రెడ్డి, పుచ్చకాయల బుచ్చిరెడ్డి, బొల్లు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సంఘం నాయకులు

వ్యాగన్‌షెడ్‌కు 'బండి' హామీ

- రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే వ్యాగన్ పీఓహెచ్ షెడ్ శంకుస్థాపన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కాజీపేటకు వచ్చే నెలలో తీసుకువస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హామీ ఇచ్చారని రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు తెలిపారు. వరంగల్ ఉమ్మడి వరంగల్ జిల్లాకు నిరుద్యోగ మార్చ్ కోసం వచ్చిన బండి సంజయ్‌ను బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రావు పద్మతో కలిసి బండి సంజయ్‌ను రైల్వే నాయకులు శనివారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ నాయకులు జి.భాస్కర్, డి.రవీందర్, అనుమాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారెపల్లి ఘటనకు పూర్తి బాధ్యత బీఆర్‌ఎస్‌దే

హసన్‌పర్తి: ఖమ్మం జిల్లా కారెపల్లి మండలం చీములపాడులో జరిగిన ఘటనకు బీఆర్‌ఎస్ పూర్తిబాధ్యత వహించాలని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జాటోతు కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. 56వ డివిజన్ బంజారాకాలనీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్‌తో కలిసి కిషన్‌నాయక్ మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా కనీస జాగ్రత్తలు తీసుకోకుండా బాణసంచా కాల్చడం వల్ల ప్రమాదం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.50 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు ప్రవీణ్‌నాయక్, రాష్ట్ర కార్యదర్శి భూక్య శ్రావణ్‌నాయక్, భిక్షపతి నాయక్, వెంకన్న నాయక్, వెంకట్ నాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిషన్‌నాయక్

మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలి



వాహన శ్రేణిని ప్రారంభిస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కాశిబుగ్గ: మంత్రి కేటీఆర్‌ను వెంటనే మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీలపై రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్డు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు చేపట్టిన నిరుద్యోగ మార్చ్‌కు పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, నిరుద్యోగులు పలు వాహనాల్లో తరలివెళ్లారు. ఈమేరకు వరంగల్ ఓ సిటీలోని తన నివాసం వద్ద జెండా ఊపి వాహన ర్యాలీని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ ప్రశ్న పత్రాలను లీక్ చేసి లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆడుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు వన్నాల వెంకటరమణ, శ్రీనివాస్ గౌడ్, చింత సాంబమూర్తి, అల్లం నాగరాజు, పిట్టల కిరణ్, కందిమల్ల మహేష్, మంతెన అమరీష్, మార్టిన్ లూథర్, ఉప్పల సురేందర్, మంద శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌కు తరలిన బీజేపీ శ్రేణులు



నిరుద్యోగ మార్చ్‌కు శివనగర్ నుంచి బస్సులో బయలుదేరుతున్న గంట రవికుమార్, నిరుద్యోగులు



నిరుద్యోగ మార్చ్‌కు పడమరకోట నుంచి బయలుదేరిన బీజేపీ శ్రేణులు

ఖిలా వరంగల్: హనుకొండ కేయూ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు శనివారం సాయంత్రం నిర్వహించిన నిరుద్యోగ మార్చ్‌కు వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం నుంచి నిరుద్యోగులు భారీగా తరలివెళ్లారు. బీజేపీ నేతలు అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, గంట రవికుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు, నిరుద్యోగులు తరలివెళ్లారు. శివనగర్‌లో బీజేపీ నేత గంట రవికుమార్ ఆధ్వర్యంలో పలువురు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఎల్లబోయిన చంద్రమోహన్, బైరి శ్యాం, పుప్పాల రాజేందర్, గొర్రె కోటి, మహేష్, పుప్పాల అశోక్, పూర్ణచందర్, కంద్రాతి శ్రీను, ఆకుతోట కిరణ్, శివ పాల్గొన్నారు.

పంది పిల్లకు పాలిచ్చిన శునకం!

కాశిబుగ్గ: కుక్కలకు పందులకు అస్సలు పడదు. పందులు కనిపిస్తే కుక్కలు వెంటబడతాయి. అలాగే.. కుక్క పిల్లలు కనిపిస్తే పందులు కూడా దాడి చేయడానికి ప్రయత్నిస్తాయి. అలాంటి వైరాన్ని మరిచి వరంగల్ నగరంలోని 19వ డివిజన్ కాశిబుగ్గ సొసైటీ కాలనీలో పందిపిల్లకు పాలిచ్చింది ఓ శునకం. ఈఘటన చోటు చేసుకుదంటూ ఓవీడియో శనివారం వాట్సాప్‌లో వైరల్ అయ్యింది.



ఏడాదిగా ఎదురుచూపులు

- న్యూశాయంపేటలో అసంపూర్తిగా సీసీ రోడ్డు నిర్మాణం

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ న్యూశాయంపేటలో 2022, జూలైలో రూ.కోటిన్నర నిధులతో చేపట్టిన బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఇప్పటివరకు రోడ్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో న్యూశాయంపేట వాసులు ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. కంకర పోసి వదిలేయడంతో దుమ్ముధూళితో ప్రయాణికులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు పనులు

సంక్షిప్తంగా

శ్రీవైష్ణవ సంఘం ప్రతినిధులకు సన్మానం

వరంగల్ చౌరస్తా: వరంగల్ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం జిల్లా ప్రతినిధులను కార్పొరేటర్లు గిర్మాజీపేటలో శనివారం సన్మానించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు రామానుజన్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి, గోవిందరాజుల గుట్ట ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాసస్వామి, ప్రతినిధులు ఎస్పీ నర్సింహస్వామి, తిరునగరి రవికుమార్, హరిపురం రవీంద్రనాథ్, తాడూరి వెంకటేశ్వర స్వామి, దాస్యం వెంకటకృష్ణ, నేరేడు కొమ్మ హరితజ్యోతిని అభినందించారు. కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన, మాజీ కార్పొరేటర్ పద్మ, బీఆర్‌ఎస్ నాయకుడు చింతాకుల సునీల్ పాల్గొన్నారు.

శ్రీరాజరాజేశ్వర నాయీబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఎన్నిక

కాజీపేట: శ్రీరాజరాజేశ్వర నాయీబ్రాహ్మణ సేవా సంఘం సుబేదారి కమిటీని కాజీపేటలోని సిద్ధార్థనగర్‌లో సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా సముద్రాల యాదగిరి, గౌరవ సలహాదారుడిగా 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు, అధ్యక్షుడిగా జంపాల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా ఎలకంటి శ్రీనివాస్, కార్యదర్శిగా ఎనగందుల హరిబాబు, కోశాధికారిగా జంపాల సతీష్, ఉపాధ్యక్షులుగా సూత్రపు కిరణ్, జనగాం సత్యనారాయణ, జంపాల కిరణ్, సోన్నాయిల మహేశ్వర్, సహాయ కార్యదర్శిగా జంపాల కుమార్, సంయుక్త కార్యదర్శిగా సింగారపు కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులుగా భిక్షపతి, రాజు, సాయికిరణ్ తదితరులను ఎన్నుకున్నారు.

శ్రీనివాస్‌యాదవ్‌కు శుభాకాంక్షలు

హన్మకొండ అర్బన్: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ హైదరాబాద్‌లో శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అరటిపండ్లతో అలంకరణ

హన్మకొండ కల్చరల్: హనుమకొండ పద్మాక్షిరోడ్డులోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి శనివారం పంచామృతాభిషేకం, 1,008 అరటిపండ్లతో అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, హనుమాన్ మాలధారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హసన్‌పర్తి: జక్కుల రాధాకృష్ణ జ్ఞాపకార్థం నగరంలోని 55వ డివిజన్ భీమారంలో చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ దయాకర్ పాల్గొని మాట్లాడారు. వేసవి కాలంలో బాటసారులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్, ఎర్రగట్టు దేవస్థాన కమిటీ చైర్మన్ చింతల లక్ష్మణ్, నాయకులు ఆకుల కుమార్, నాయకపు శ్రీనివాస్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సంగాల ప్రేమ్‌కుమార్, నిర్వాహకులు జక్కుల విజయ్, జక్కుల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గామాత ఆలయంలో మజ్జిగ పంపిణీ

కాశిబుగ్గ: వరంగల్ దయానంద కాలనీలోని కనకదుర్గామాత దేవాలయంలో భక్తులకు శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాశ్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు గంపా శ్రవణ్‌కుమార్, కూచన రవిందర్, సర్వేరియా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాగి జావ అందజేత

కాజీపేట అర్బన్: నగరానికి చెందిన కుశాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యేంద్రనాథ్ శనివారం తన పుట్టినరోజు సందర్భంగా హంటర్‌రోడ్డు న్యూశాయంపేటలోని ప్రకాష్‌రెడ్డిపేటలో రాగి జావ పంపిణీ చేశారు. ఆర్భాటంగా బర్త్‌డేను జరుపుకునే బదులు నిరుపేదలకు రాగి జావ అందజేయడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ప్లంబర్‌కు తీవ్ర గాయాలు

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో గుర్తు తెలియని ఆటో ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న ఉల్లెంగుల సంపత్ అనే వ్యక్తి శనివారం తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్ కాలనీకి చెందిన సంపత్ ప్లంబర్‌గా పని చేస్తున్నారు. వ్యక్తిగత పనుల మీద కాజీపేటకు వస్తున్న సంపత్‌ను ఆటో ఢీకొట్టడంతో రోడ్డుపై ఎగిరిపడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు ఇంకా ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

కాశిబుగ్గ: వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉందని, ఈ క్రమంలో ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఫైర్ స్టేషన్ అధికారి శ్రీనివాస్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా వరంగల్ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ఫైర్ మాక్‌డ్రిల్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూ ఫైర్ స్టేషన్‌కు సమాచారమివ్వాలని చెప్పారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మాక్‌డ్రిల్‌లో ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది రవిందర్, సురేందర్, చంద్రమౌళి, హరిబాబు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ రైల్వే స్టేషన్ ఎదుట ఫైర్ మాక్‌డ్రిల్

సీపీఎస్ ర్యాలీని విజయవంతం చేయాలి

విద్యారణ్యపురి: ఉద్యోగుల మార్చ్ (ర్యాలీ)ను విజయవంతం చేయాలని రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల యూనియన్ అధ్యక్షులు కందుల జీవన్‌కుమార్, రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు కొంద శ్రీనివాస్, శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం (సీపీఎస్) నూతన విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ పిలుపు మేరకు ఈనెల 16న హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల ఆధ్వర్యంలో వరంగల్ ఎంజీఎం కూడలి వద్ద బైక్ ర్యాలీ ప్రారంభమై హనుమకొండలోని ఏకశిల పార్కు వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం, అక్కడి నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు పాదయాత్రగా వెళ్లనున్నట్లు వివరించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.